క్లుప్తంగా

ఆలయంలో ప్రత్యేక పూజలు

కృష్ణా: దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే సీతాదయాకర్‌రెడ్డి శుక్రవారం రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టడంతో మండల కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు అనుసూయమ్మ, సీనియర్ నాయకుడు రాంలింగప్ప మాస్టర్ మాట్లాడుతూ తమ నాయకురాలు సీతమ్మ నిరంతరం ప్రజల్లో ఉంటూ ప్రజాసేవకే అంకితమయ్యారని కొనియాడారు. అలాంటి నాయకురాలికి రాష్ట్రస్థాయి పదవి అప్పగించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియచేస్తూ కున్సీ గ్రామంలోని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పార్టీ నాయకులు స్వీట్లు పంచుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు విజయప్ప, శరణప్పగౌడ, రాంచందర్ మాస్టర్ తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ బిల్లు వెనక్కి తీసుకోవాలి



ఊట్కూరు: కేంద్ర ప్రభుత్వం ఇటీవల పార్లమెంట్‌లో వక్ఫ్ బిల్లును ప్రవేశపెట్టి, ఆమోదించడంపై ఊట్కూరులో ముస్లిం మైనార్టీలు శుక్రవారం నిరసన ర్యాలీ చేపట్టారు. స్థానిక పంచ్‌మస్‌జీద్ నుంచి ప్లకార్డులతో వక్ఫ్ బిల్లును ఉపసంహరించుకోవాలని గ్రామ పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ చింత రవికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో నాయకులు అబ్దుల్‌కయ్యూం, మన్సూర్‌అలీ, కాలిక్, ఇబ్రహీం, బిజ్వార్ సలీం తదితరులు పాల్గొన్నారు.

జీపీ కార్మికుల సమ్మె నోటీసు

నారాయణపేట రూరల్: బకాయి వేతనాల చెల్లించడంలో ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ ఈ నెల 19 తర్వాత నిరవధిక సమ్మె చేస్తున్నట్లు సీఐటీయూ జిల్లా కార్యదర్శి బలరాం తెలిపారు. శుక్రవారం జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ సత్తయ్యకు సమ్మె నోటీసును అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పల్లెల పరిశుభ్రతకు కృషి చేస్తున్న పంచాయతీ కార్మికులపై ప్రభుత్వం చిన్నచూపు చూస్తుందని ఆరోపించారు. ఆర్థిక శాఖకు ప్రభుత్వం చెక్కులు అందిస్తూనే డబ్బులు కేటాయించకుండా ద్వంద వైఖరిని అనుసరించడం సరైంది కాదన్నారు. గ్రీన్ చానల్ ద్వారా వేతనాలు అందిస్తామని ప్రకటించినా ఇప్పటికీ అమలు కాకపోవడం బాధాకరమని ఆందోళన వ్యక్తం చేశారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యం



నారాయణపేట: రాబోయే స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేద్దామని పేట జిల్లా యూత్ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ కృష్ణవర్ధన్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంధ్య, జిల్లా అధ్యక్షుడు కోట్ల మధుసూదన్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జిల్లా యువజన కాంగ్రెస్ జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అమలు చేసిన ఆరు గ్యారెంటీలను గడపగడపకు వివరించాలని సూచించారు. పదేళ్లు అధికారంలో లేకున్నా గ్రామస్థాయిలో యువజన కాంగ్రెస్ నాయకులు పార్టీకి పట్టుకొమ్మల్లా ఉంటూ పార్టీ పటిష్టత కోసం ఎంతో కృషి చేశారని కొనియాడారు. అనంతరం పలువురు మండలాల అధ్యక్షులు మాట్లాడుతూ రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తు చేసుకున్న యువజన కాంగ్రెస్ విభాగానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చి గుర్తింపు ఇవ్వాలన్నారు. ఎన్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు దామోదర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు విజయ్‌చౌహన్, నాయకులు హరీశ్వర్‌రెడ్డి, వేణుగౌడ్, రవీందర్‌బాబు, లక్ష్మీకాంత్‌రెడ్డి, యూసుఫ్ పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలి

కృష్ణా: మండలంలోని గుడెబల్లూర్, మురహర్‌దొడ్డి గ్రామాల్లో శుక్రవారం ఐకేపీ ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రాలను తహసీల్దార్ వెంకటేష్, ఏపీఎం బస్వరాజ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ మండలంలోని రైతులు ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జానయ్య, ఏఓ సుదర్శన్‌గౌడ్, కాంగ్రెస్ నాయకులు క్రిష్ణమూర్తి, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.



దరఖాస్తుల వెల్లువ

- రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తులు
- రుణాలు ఇప్పిస్తామంటూ దళారుల ఎర
- మోసపోవద్దని అధికారుల వినతి

దామరగిద్ద: మండలంలోని వివిధ గ్రామాల యువతి, యువకులు రాజీవ్ యువవికాస్‌కు దరఖాస్తులు చేసుకుంటున్నారు. వారం రోజులుగా ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలకు దరఖాస్తు చేసుకున్న అర్హులకు ఆన్‌లైన్ దరఖాస్తు గడువు పెంపుతో ఊరట లభించింది. తెలంగాణ ఆన్‌లైన్ బెనిఫిషనరీ మేనేజ్‌మెంట్ అండ్ మానిటరింగ్ సిస్టమ్ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్ దరఖాస్తులు చేసిన వారి సంఖ్య 100కు పైగా ఉండగా.. కార్యాలయానికి 90 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. ఆన్‌లైన్ చేసి దరఖాస్తు పత్రాన్ని స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో అందజేయాలని సూపరింటెండెంట్ శ్రీనివాస్ తెలిపారు. తెల్ల రేషన్‌కార్డు కలిగిన వారు ఆదాయ ధ్రువపత్రం లేకపోయినా దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు.



ఎంపీడీఓ కార్యాలయంలో రాజీవ్ యువ వికాసం దరఖాస్తు అందజేస్తున్న అర్హులు

రూ.10 వేలు ఇస్తే మంజూరు చేయిస్తాం

నిరక్షరాస్యులైన కొందరు అర్హులకు దళారులు టోకరా వేసేందుకు సిద్ధమయ్యారు. రాజీవ్ యువ వికాసం రుణాలు ఇప్పిస్తామని, తమకు ఉన్నత స్థానాల్లో ఉన్న వారితో పరిచయాలు ఉన్నాయని కేటుగాళ్లు పుట్టుకొచ్చారు. రూ.10 వేలు ఇస్తే దరఖాస్తు చేసి రుణాలు మంజూరు చేయిస్తామంటూ అమాయకులకు మాయ మాటలు చెప్పి డబ్బులు కాజేస్తున్నట్లు సమాచారం. అర్హులైన వారికి దశల వారీగా మండల, జిల్లా అధికారులు వెరిఫికేషన్, బ్యాంక్ కన్సెంట్ లెటర్ అందిన వారికి రుణాలు మంజూరు అవుతాయని, రుణాలు మంజూరు చేయిస్తామని చెప్పిన వారిని నమ్మి మోసపోవద్దని అధికారులు కోరుతున్నారు.

మందిపల్లిలో తాగునీటి ఎద్దడి

మాగనూర్: మండలంలోని మందిపల్లిలో తాగునీటి ఎద్దడి నెలకొందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మొదటి నుంచి తాగునీటి సమస్య ఉన్నా.. వేసవికాలం మొదలు కావడంతోనే ఈ సమస్య మరింత తీవ్ర రూపం దాల్చింది. గ్రామానికి పక్కనే కృష్ణానదితో పాటు, పెద్ద వాగు కూడా ప్రవహిస్తున్నా ఈ విధంగా తాగునీటి సమస్య రావడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో తాగునీటి సమస్య ఉన్న విషయం తెలిసినా.. అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవడంలో విఫలమవుతున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా తాగునీటి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.



తాగునీటి కోసం ఎగబడ్డ గ్రామస్తులు

ముగిసిన సామూహిక గీతాజ్ఞాన యజ్ఞాలు

మరికల్: మండలంలోని అప్పంపల్లి ఆంజనేయ స్వామి ఆలయ ఆవరణలో మూడు రోజుల పాటు చేపట్టిన 499 శివరామకోటి జప, గీతాజ్ఞాన యజ్ఞాల కార్యక్రమం శుక్రవారం నాటితో ముగిశాయి. ఈ సందర్భంగా చివరి రోజు 42 మంది జంటలతో సదానంద యోగీశ్వరులు, రఘునాథపూర్, బ్రహ్మచారి సామూహిక యజ్ఞాలు చేయించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఇప్పటి వరకు అప్పంపల్లితో కలిపి 499 యజ్ఞ కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. తర్వాలోనే చిన్నచింతకుంట మండలంలోని బండర్‌పల్లి వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద 500వ గీతాజ్ఞాన యజ్ఞ కార్యక్రమంలో అధిక సంఖ్యలో దంపతులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. అనంతరం గ్రామస్తులకు తీర్థప్రసాదాలతో పాటు అన్నదానం చేశారు.



సాముహిక యజ్ఞంలో పాల్గొన్న దంపతులు

యువత డ్రగ్స్‌కు బానిస కావొద్దు



అవగహన కల్పిస్తున్న ప్రిన్సిపాల్ నారాయణగౌడ్

మక్తల్: యువత డ్రగ్స్‌కు అలవాటు పడొద్దని మక్తల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ నారాయణగౌడ్ అన్నారు. శుక్రవారం డిగ్రీ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. యువత డ్రగ్స్‌కు బానిస కావడంతో కావడంతో సంఘ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో యాంటి డ్రగ్స్ కమిటీ కన్వీనర్ హరిశ్చంద్ర, తిరుపతి, రాజేశ్వరి, రమేష్‌గౌడ్, బాల్‌రాజ్, లింగప్ప, లక్ష్మీకాంత్, నర్సోజీ, మహేష్, సులోచన, నాగేంద్రమ్మ, ప్రదీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఔదార్యం చాటుకున్న ఉపాధ్యాయులు

కోస్గి: రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తమ పాఠశాల విద్యార్థికి ఆర్థికసాయం అందించి ఉపాధ్యాయులు ఔదార్యం చాటుకున్నారు. మండలంలోని సర్జఖాన్‌పేట గ్రామానికి చెందిన ప్రణవి అదే గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. వారం క్రితం రోడ్డు దాటుతున్న విద్యార్థిని ఓ డీసీఎం ఢీకొట్టడంతో కాలు విరిగి, తీవ్ర గాయాలపాలైంది. విద్యార్థినిని పాలమూర్ జిల్లా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. తండ్రి లేని బాలికకు పాఠశాల హెచ్‌ఎం కృష్ణగౌడ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు శుక్రవారం రూ.10 వేలు ఆర్థికసాయం అందించి, పరామర్శించారు.



బాలిక తల్లికి నగదు అందజేస్తున్న పాఠశాల హెచ్‌ఎం కృష్ణగౌడ్

‘పది’ విద్యార్థులకు అవగాహన

నారాయణపేట రూరల్: మండలంలోని జాజాపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం పది పరీక్షలు రాసిన విద్యార్థులకు భవిష్యత్ ప్రణాళికపై అవగాహన కల్పించారు. తెలంగాణ విద్యాశాఖ, టీ షాట్ ప్రత్యక్ష ప్రసారంలో సైతం వీక్షించే విధంగా ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా శిక్షణ సంస్థ డైరెక్టర్ రమేష్, ఇంటర్ బోర్డ్ సీఈఓ జయప్రద, ఎస్సీఆర్టీ ఈడీ మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు పదో తరగతి పాస్ అయిన తర్వాత ఇంటర్మీడియట్ కోర్సులో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, పాలిటెక్నిక్, అగ్రికల్చర్, ట్రిబుల్ ఐటీ, హార్టికల్చర్‌తో పాటు వివిధ కోర్సుల్లో చేరే విధానం, కోర్సు వివరాలు గురించి వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయులు మధుసూదన్‌రావు, డీఎస్‌ఓహెచ్ భానుప్రకాష్, ప్రతాప్, శశిరేఖ, మంగళ, నిర్మల పాల్గొన్నారు.



విద్యార్థులకు కోర్సు వివరాలు వివరిస్తున్న డీఎస్‌ఓ

వందరోజుల కూలీ పని కల్పించాలి

ధన్వాడ: ఉపాధి హామీ పథకంలో భాగంగా కూలీలకు వంద రోజుల పని కల్పించడంతో పాటు రోజుకు రూ.300 కూలి వచ్చేలా పనులు చేయించాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. శుక్రవారం మండలంలోని మందిపల్లి శివారు గుట్టలో కొనసాగుతున్న ట్రెంచెస్ ఉపాధిహామీ పనులను ఆమె పరిశీలించి కూలీలతో మాట్లాడారు. కొందరు కూలీలు తమకు ఇంత వరకు కూలి డబ్బులు రాలేదని కలెక్టర్ దృష్టికి తీసుకురాగా.. డబ్బులు వారి ఖాతాల్లో జమ అయ్యేలా చూడాలని ఏపీఓ సిద్ధేశ్వర్‌ను ఆదేశించారు. కూలీలకు క్షేత్రస్థాయిలో కల్పించాల్సిన కనీస వసతులను ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం మండల కేంద్రంలో రూఫ్ లెవెల్ నిర్మాణం పూర్తయిన ఇందిరమ్మ మోడల్ ఇంటిని కలెక్టర్ పరిశీలించారు. ఇంటి నిర్మాణం నెలరోజుల లోపు పూర్తి చేయాలని సూచించారు. అలాగే రాజీవ్ యువ వికాసం పథకం దరఖాస్తులు ఎన్ని వచ్చాయని ఎంపీడీఓ సాయిప్రకాష్‌ను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో హౌసింగ్ పీడీ శంకర్, తహసీల్దార్ సింధూజ, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.



ఉపాధిహామీ కూలీలతో మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

కంటి వైద్య శిబిరం ఏర్పాటు

మక్తల్: మండలంలోని భూత్పూర్‌లో శుక్రవారం వాకిటి శ్రీహరి సేవాసమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని రాంరెడ్డి కంటి ఆస్పత్రి ఎనుగొండ వారి సౌజన్యంతో మార్కెట్ వైస్ చైర్మన్ గణేష్‌కుమార్ ప్రారంభించారు. ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి సహకారంతో గ్రామాల్లో ఉచిత కంటి శిబిరాలు నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. 80 మందికి చికిత్స చేయగా దాదాపు 35 మంది కంటి సమస్యలు ఉన్నట్లు గుర్తించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ చంద్రకాంత్‌గౌడ్, మాజీ ఉపసర్పంచ కట్ట సురేష్, మాజీ ఎంపీటీసీ కుర్మయ్యగౌడ్, బీంసేన్‌రావు, రఘుపతిరెడ్డి, పట్టణ అధ్యక్షుడు రవికుమార్, నూరోద్దిన్, రవికుమార్, హసముద్దిన్, బోయ నర్సింహ, రవి తదితరులు పాల్గొన్నారు.

జగన్నాథ స్వామి ఆలయ నిర్మాణానికి విరాళం



నారాయణపేట టౌన్: పట్టణంలో నూతనంగా నిర్మించనున్న జగన్నాథస్వామి ఆలయ నిర్మాణానికి పేరపళ్ల గ్రామ వాస్తవ్యులు, ప్రభుత్వ ఉపాధ్యాయుడు రామకృష్ణ తల్లిదండ్రులు జయశ్రీ, వెంకట్రాములు చేతుల మీదుగా రూ.51,116 ఇస్కాన్ ధర్మప్రచారకులు అద్భుత్ నరసింహదాస్‌కు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి ధార్మిక కార్యక్రమాన్ని భద్రాద్రి రామకార్యంగా తలచి ధార్మిక కార్యక్రమాలకు తమవంతు సహకారం అందిస్తున్నామని తెలిపారు. దాతలను ఇస్కాన్ ప్రచారకులు అభినందించారు. కార్యక్రమంలో సభ్యులు సతీష్, పతంజలి యోగా జిల్లా అధ్యక్షుడు సురేష్‌కుమార్, వెంకటేష్, శ్రీనివాస్, కుమ్మరి నర్సింలు పాల్గొన్నారు.

బావాజీ జాతర ఏర్పాట్లపై సమీక్ష

కొత్తపల్లి: తిమ్మారెడ్డిపల్లిలో వెలిసిన గిరిజనుల ఆరాధ్య దైవం గురులోకా మసంద్ ప్రభు బావాజీ జాతర ఏప్రిల్ 11నుంచి నాలుగు రోజుల పాటు నిర్వహించనున్న నేపథ్యంలో తాగునీరు, మరుగుదొడ్లు, రవాణా, విద్యుత్ సదుపాయం తదితర ఏర్పాట్లపై అన్ని శాఖల అధికారులతో జిల్లా అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ సమావేశం నిర్వహించారు. ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బ్రహ్మోత్సవాలకు వచ్చే వాహనాలకు పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేయాలని, అలాగే ఆలయ పరిసరాల్లో నిఘా పెంచాలని సూచించారు. జాతరలో శానిటేషన్ నిర్వహణకు అదనపు సిబ్బందిని నియమించాలన్నారు.

ప్రమాదవశాత్తు గాజుల దుకాణం, హోటల్ దగ్ధం



ఊట్కూరు: మండలంలోని నిడుగుర్తిలో శుక్రవారం మధ్యాహ్నం ప్రమాదవశాత్తు గాజుల దుకాణం, హోటల్ దగ్ధమయిన ఘటన చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. రఫీ హోటల్, అనీఫ్ గాజుల దుకాణాలు పక్కపక్కనే ఉన్నాయి. శుక్రవారం మధ్యాహ్నం వాటికి మంటలు చెలరేగగా.. స్థానికులు గమనించి మంటలను ఆర్పివేశారు. అప్పటికే హోటల్, గాజుల దుకాణాలు పూర్తిగా దగ్ధమయ్యాయి. ఘటనలో రూ.3 లక్షల వరకు ఆస్తినష్టం జరిగిందని బాధితులు వాపోతున్నారు. దుకాణాలకు నిప్పు ఎలా అంటుకున్న విషయం తెలియడం లేదని స్థానికులు తెలిపారు. ప్రభుత్వం బాధితులను ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కనులపండుగగా గోవృషభ కల్యాణం



బిజ్వార్‌లో గోవృషభ కల్యాణం జరిపిస్తున్న ఆదిత్య పరాశ్రీ

ఊట్కూర్: సనాతన ధర్మ పరిరక్షణకు ప్రభుత్వాలు ముందుకు రావాలని అంబాత్రయక్షేత్రం వ్యవస్థాపకుడు ఆదిత్య పరాశ్రీ అన్నారు. మండలంలోని బిజ్వార్‌లోని అంబాత్రయ క్షేత్రంలో శుక్రవారం ఉదయం 9 గంటలకు ఆదిత్య పరాశ్రీ ఆధ్వర్యంలో గోవృషభ కల్యాణం కనులపండువగా నిర్వహించారు. ఉత్సవాలను తిలకించేందుకు వచ్చిన భక్తులు చేసిన అమ్మవారి నామస్మరణతో అంబాత్రయక్షేత్రం మార్మోగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోవు ముక్కోటి దేవతల నిలయమని, గోవును పరిరక్షిస్తే పర్యావరణాన్ని, జీవరాశిని సంరక్షించినట్లే అన్నారు. దేశంలో గోవధ నిషేధాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పటిష్టంగా అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. హిందువుల్లో ఐక్యత లేకపోవడంతో ధర్మంపై దాడులు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన రక్తదాన, వైద్య శిబిరం విజయవంతమైంది. వేడుకల్లో పీఠాధిపతులు పంచమ సిద్ధలింగ స్వామి, బాల లింగేశ్వరస్వామి, సంగ్రామ మహారాజ్, రాజయ్య స్వామి, అంబికా శివాయోగ స్వామి, మహానందగిరి స్వామి, నాయకులు నాగురావు నామాజీ, కొండయ్య, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

మరికల్: విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన భోజనం అందించాలని తహసీల్దార్ అనిల్‌కుమార్ అన్నారు. మండలంలోని అప్పంపల్లి ప్రాథమిక పాఠశాలను శుక్రవారం తహసీల్దార్ ఆకస్మికంగా విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం వారితో కలిసి భోజనం చేశారు. విద్యార్థులకు వండిన వంటలపై సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆర్‌ఐ సుధాకార్‌రెడ్డి, మురళి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం

మాగనూర్: మండలంలోని అమ్మపల్లి ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం విద్యార్థులు స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు మాట్లాడుతూ విద్యార్థులు ఒక రోజు ఉపాధ్యాయులుగా చక్కగా పాఠాలు బోధించారని తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం పాఠశాల అభివృద్ధికి చేయూతనిచ్చిన వారిని శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పీఆర్టీయూ మండల అధ్యక్షుడు బలరాం తదితరులు పాల్గొన్నారు.



అమ్మపల్లిలో విద్యార్థులతో ఉపాధ్యాయులు

జాబ్‌మేళాతో నిరుద్యోగ యువతకు ఉపాధి

నారాయణపేట ఎడ్యుకేషన్: సేవా భారతి పాలమూరు, చిట్టెం నర్సిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన జాబ్ మేళాకు విశేష స్పందన లభించిందని ప్రిన్సిపాల్ మెర్సీ వసంత అన్నారు. జాబ్‌మేళాలో ఇన్ఫోసిస్ నిర్మాణ్ సంస్థ, ఒలెక్ట్రా, ట్రి జియో, స్కై కాడ్, హిమా ల్యాబ్, మాతృభూమి తదితర కంపెనీలు పాల్గొనగా.. 150 మంది నిరుద్యోగులు హాజరుకాగా అందులో 104 మందికి ఇంటర్వ్యూలు నిర్వహించారని సేవా భారతి విభాగ్ కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగాలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మెర్సీ వసంత మాట్లాడుతూ.. జాబ్ మేళాలను నారాయణపేట జిల్లా లాంటి వెనకబడిన ప్రాంతంలో నిర్వహించడం ద్వారా నిరుద్యోగ యువత ఉపాధి అవకాశాలు దొరుకుతాయన్నారు. కార్యాక్రమంలో సేవా భారతి జిల్లా అధ్యక్షుడు రాందేవ్‌రెడ్డి, సీనియర్ లెక్చరర్ రంగారెడ్డి, డాక్టర్ కృష్ణారెడ్డి, అడ్వకేట్ రాంచందర్, సత్యనారాయణగౌడ్, సురేష్, సుజాత్‌అలీ, నవత, శరత్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మెర్సీ వసంత

బీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించాలి

మరికల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చట్ట సభల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని బీసీ జాగృతి సేన రాష్ట్ర అధ్యక్షుడు బూర్గుపల్లి కృష్ణయాదవ్ డిమాండ్ చేశారు. మరికల్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎన్నికలు వచ్చిన ప్రతిసారి ఓట్ల కోసం బీసీ జపం చేయడంలో పోటీపడే రాజకీయ పార్టీలు సీట్ల కేటాయింపు విషయంలో తీరని అన్యాయం చేస్తున్నాయని మండిపడ్డారు. మెజార్టీ ప్రజలుగా ఉన్న బీసీలకు చట్టసభలో మాత్రం న్యాయం జరగడం లేదని వాపోయారు. అన్ని రంగాల్లో వెనకబడ్డన బీసీలకు న్యాయం చేయకపోతే భవిష్యత్‌లో రాజకీయ పార్టీలకు పుట్టగతులుండవని హెచ్చరించారు. అనంతరం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్ రాష్ట్ర అధ్యక్షుడిని సన్మానించారు. సమావేశంలో నర్సిములు, కేశవులు, రాజు, రఘు, హన్మంతు, తిరుపతయ్య, కుర్మన్న, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్మీ జవాన్లకు ఘన సన్మానం

దామరగిద్ద: మండలంలోని వివిధ గ్రామాల యువకులు ఇండియన్ నేవీ, ఆర్మీలో జవాన్లుగా ఎంపిక కావడం మండలానికి గర్వ కారణమని సామాజిక కార్యకర్త, బాపన్‌పల్లి మాజీ సర్పంచ్ గవినోళ్ల శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండలంలోని కందెన్‌పల్లి, బాపన్‌పల్లి, దామరగిద్దతండా, ముస్తాపేట్ గ్రామాల్లో ఆర్మీ జవాన్లుగా ఎంపికైన వారికి శాలువాతో సత్కరించాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ యువతకు దేశ సేవలో కొనసాగే అవకాశం రావడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా మిల్కాసింగ్ స్పోర్ట్స్ అకాడమీ నిర్వాహకుడు కావలి మహేష్ ఉచిత కోచింగ్ అందించి 14 మందిని ఆర్మీ ఉద్యోగం సాధించేలా కృషి చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆర్మీకి ఎంపికైన ఆనంద్, రవికుమార్, వివేక్, శ్రీకాంత్, కృష్ణ, ఉషనప్ప, రఘువర్ధన్, శివ, సిద్ధు, యోగేష్, పవన్ పాల్గొన్నారు.

సన్నబియ్యం పేదలకు వరం

మద్దూరు: రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో మండల కాంగ్రెస్ నాయకులతో కలిసి తహసీల్దార్ మహేష్‌గౌడ్ ప్రారంభించారు. లబ్ధిదారులు సన్నబియ్యం పక్కదారి పట్టకుండా సద్వినియోగించుకోవాలన్నారు. లబ్ధిదారులు సన్న బియ్యాన్ని దళారులకు విక్రయించినట్లు తెలిస్తే వారి రేషన్ కార్డును శాశ్వతంగా రద్దు చేసి, కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు నర్సిములు, మాజీ జెడ్పీటీసీ రఘుపతిరెడ్డి, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లి: మండల కేంద్రంలో సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం ఇన్‌చార్జ్ తహసీల్దార్ కరుణాకర్ ప్రారంభించారు.

వీరభద్రేశ్వర బ్రహ్మోత్సవాలు

దామరగిద్ద: మండలంలోని క్యాతన్‌పల్లిలో వెలిసిన భద్రకాళీ సమేత వీరభద్రేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. శుక్రవారం రాత్రి డోలారోహణం, మహారథోత్సవం, పూజలు చేపట్టారు. వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన భీష్మరాజ్ ఫౌండేషన్ చైర్మన్ రాజ్‌కుమార్‌రెడ్డిని ఆలయ మర్యాదలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి తన వంతు సహకారం అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు నారాయణ, సబ్బంత్‌రాజ్, శరణప్ప, శరణయ్యస్వామి శివకుమార్‌స్వామి, గురులింగప్ప భక్తులు తదితరులు పాల్గొన్నారు.

సామాజిక రుగ్మతలు తరిమికొట్టాలి

దామరగిద్ద: సమాజంలో బాలికలు, మహిళలను పట్టిపీడిస్తున్న బాల్యవివాహాలు, జోగిని వ్యవస్థ, గృహహింస, మూఢనమ్మకాలు వంటి సామాజిక రుగ్మతలను పారద్రోలాల్సిన అవసరం అందరిపై ఉందని సామాజిక కార్యకర్త హజమ్మ, డిప్యూటీ తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, మాజీ సర్పంచ్ రవీందర్‌నాథ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఐఎంఎఫ్‌ఓ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు, ఉపాధి కూలీలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 18 ఏళ్ల వయస్సు దాటిన ఆడపిల్లలకే పెళ్లిళ్లు చేయాలని, ఆడపడుచులను జోగినిలు మార్చి వారి జీవితాలను గుగ్గిపాలు చేయొద్దని సూచించారు. ఆధునిక కాలంలో సాంకేతిక పరిజ్ఞానం ఎంతో పెరిగిందన్నారు. ఎవరు ఎలాంటి సామాజిక రుగ్మతలకు గురైనా టోల్ ఫ్రీ నెంబర్ 15100 కు కాల్ చేస్తే సాయం అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ వెంకటప్ప, లక్ష్మణ్, మండల కోఆర్డినేటర్ ఆశమ్మ, వలంటీర్ కృష్ణవేణి, సంతోషమ్మ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రవీంద్రనాథ్

బీటీ రోడ్డు నిర్మించాలి

మరికల్: మండలంలోని ఎలిగండ్ల నుంచి కంసాన్‌పల్లి గ్రామాల మధ్య బీటీరోడ్డు మంజూరు చేయాలని బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా కన్వీనర్ శ్రీరామ్, నాయకులు నరేష్‌గౌడ్, సంతోష్ కోరారు. శుక్రవారం వారు విలేకర్లతో మాట్లాడుతూ ఎంపీ, ఎమ్మెల్యే నిధులు మంజూరు చేసి ఈ రెండు గ్రామాల మధ్య బీటీ రోడ్డు వేయాలని విజ్ఞప్తి చేశారు. 20 ఏళ్ల నుంచి సమస్యను ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని వాపోయారు. ప్రస్తుతం ఎంపీ, ఎమ్మెల్యే స్పందించి బీటీరోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు.